సాక్షి
సిద్దిపేట
సోమవారం । 13 । మార్చి । 2023




ప్లాస్టిక్‌తో పర్యావరణానికి ముప్పు

హుస్నాబాద్ మున్సిపాలిటీ పరిధిలో ఇష్టారీతిన ప్లాస్టిక్‌ను వినియోగిస్తున్నారు. అధికారులు తనిఖీలు చేస్తున్నా షాపుల్లో ప్లాస్టిక్ సంచులను అమ్ముతున్నారు. 8లో..



చేపలు పట్టేందుకు వెళ్లి

సంగారెడ్డి, మెదక్‌జిల్లాల్లో చేపలు పట్టేందుకు వెళ్లి ఇద్దరు మృత్యువాత పడ్డారు. అంసాన్‌పల్లిలో వల చిక్కుకొని వెంకటయ్య చనిపోయాడు 8లో..



ఇరుకు గదుల్లో ఇంకెన్నాళ్లు?

సొంత భవనాలు లేక అద్దె భవనాల్లోనే కొన సాగుతున్నాయి. స్థలాలు గుర్తించిన నిధులు లేక పనులు ప్రారంభం కాలేదు. 9లో..

న్యూస్‌రీల్

త్వరలో కొండపోచమ్మ పునర్నిర్మాణ పనులు

మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్



పూజలు చేస్తున్న మంత్రి శ్రీనివాస్‌యాదవ్

జగదేవ్‌పూర్(గజ్వేల్): కొండపోచమ్మ ఆలయ పునర్నిర్మాణ పనులు త్వరలో ప్రారంభిస్తామని పశుసంవర్ధక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. ఆదివారం మండలంలోని శ్రీ కొండపోచమ్మ అమ్మ వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ సిబ్బంది ఆయనకు పూర్ణకుంభంతో స్వాగతం పలుకగా, సర్పంచ్ రజిత, ఆలయ సిబ్బంది శాలువా కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణలో కొండపోచమ్మ ఆలయం ఎంతో ప్రసిద్ధి గాంచిందని, సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో కొండపోచమ్మ అభివృద్ధికి నిధులు కేటాయించారని తెలిపారు. వచ్చే ఏడాది వరకు పునర్నిర్మాణ పనులు పూర్తి చేసి భక్తులకు అన్ని వసతులు కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీల ఫోరం మండలాధ్యక్షురాలు కావ్య, డైరెక్టర్ కనకయ్య, నాయకులు స్వామి, ఆలయ సిబ్బంది వెంకట్‌రెడ్డి, కనకయ్య, లక్ష్మణ్, సుధాకర్, చందు, హరి, చిన్నా, శ్రీనివాస్, ఏసీసీ రమేష్, ఎస్‌ఐ కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

కాళేశ్వరంతో చెరువులకు కళ

జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ



జలహారతి ఇస్తున్న రోజాశర్మ

చిన్నకోడూరు(సిద్దిపేట): కాళేశ్వరం జలాలతో మండుటెండల్లో సైతం చెరువులు, కుంటలు కళకళలాడుతున్నాయని, మిషన్ కాకతీయ ఫలాలు స్పష్టంగా కనిపిస్తున్నాయని జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ అన్నారు. మిషన్ కాకతీయ ప్రారంభించి నేటికి 9 ఏళ్లు అవుతున్న సందర్భంగా ఆదివారం రాత్రి చిన్నకోడూరు పెద్ద చెరువులో గంగమ్మకు జలహారతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండుటెండల్లో చెరువు కుంటల్లో జల సిరులు కనిపిస్తున్నాయన్నారు. తొమ్మిదేళ్ల కాలంలో 90 ఏళ్ల చెరువులకు పూర్వ వైభవం తెచ్చిన ఘనత సీఎం కేసీఆర్, మంత్రి హరీశ్ రావులదేనన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మాణిక్యరెడ్డి, ఉపాధ్యక్షుడు పాపయ్య, ఏఎంసీ చైర్మన్ కొండం వనిత, పీఏసీఎస్ చైర్మన్‌లు కనకరాజు, సదానందం గౌడ్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కాముని శ్రీనివాస్, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు ఉమేష్ చంద్ర, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు శ్రీనివాస్, రైతు బంధు డైరెక్టర్ వెంకటేశం పాల్గొన్నారు.

కార్మికులకు గుర్తింపు కార్డులు



గుర్తింపు కార్డులను అందజేస్తున్న శ్రీకాంత్

కొండపాక(గజ్వేల్): కస్తుర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లో పని చేస్తున్న నాన్ టీచింగ్ వర్కర్స్ సమస్యలను పరిష్కరించాలని నాన్ టీచింగ్ వర్కర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఎస్.వి.శ్రీకాంత్ కోరారు. ఆదివారం కొండపాక కస్తూర్బా గాంధీ పాఠశాల వద్ద నిర్వహించిన కార్యక్రమంలో నాన్‌టీచింగ్ వర్కర్స్‌కు గుర్తింపు కార్డులను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కేజీబీవీలో పని చేస్తున్న నాన్‌టీచింగ్ వర్కర్లకు కనీస వేతనాలను అమలు చేయకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాంట్రాక్టు కార్మికులను సీఎం ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేసి, పని భారాన్ని తగ్గించాలన్నారు. కార్యక్రమంలో సభ్యులు శ్రీలత, యాదమ్మ, శోభ, యశోద, కనకలక్ష్మి, పద్మ పాల్గొన్నారు.

14న చలో హైదరాబాద్

గజ్వేల్‌రూరల్: దళితులపై పెరుగుతున్న దాడులను నిరసిస్తూ ఈ నెల 14న హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద చేపట్టనున్న మహాధర్నాను విజయవంతం చేయాలని డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి పి.శంకర్ పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద కరపత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు. బీజేపీ పాలనలో దేశవ్యాప్తంగా దళితులు, మహిళలు, మైనార్టీలపై దాడులు పెరిగాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం నిర్వీర్యం అవుతోందని ఆరోపించారు. కార్యక్రమంలో డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఏగొండస్వామి, నాయకులు వేణు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ హోదా ఎప్పుడో?

- రాజీవ్ రహదారిపై పెరిగిన ట్రాఫిక్
- ఆరు లేన్ల విస్తరణ అవశ్యం
- ఏళ్ల తరబడి పెండింగ్‌లో ప్రతిపాదన
- అనుసంధానిస్తే మరింత అభివృద్ధి



సిద్దిపేట జిల్లాలో రాజీవ్‌రహదారి

గజ్వేల్: రాజీవ్ రహదారికి జాతీయ హోదా ప్రతిపాదన ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉంటోంది. మేడ్చల్ జిల్లా శామీర్‌పేట నుంచి సిద్దిపేట, ఉమ్మడి కరీంనగర్ జిల్లాల మీదుగా, మంచిర్యాల వరకు 207 కిలోమీటర్ల మేర ఈ రాజీవ్ రహదారి ఉంది. ఈ రోడ్డుపై వెళ్లే వాహనాల సంఖ్య భారీగా పెరగడంతో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. నాలుగులేన్ల ఈ రహదారిపై మూల మలుపులను సరిచేస్తూ ఆరు లేన్లుగా విస్తరించి, జాతీయ హోదా కల్పిస్తే ప్రమాదాల నివారణతో పాటు, ప్రయాణం మరింత సౌకర్యవంతంగా ఉంటుందనే వాదనలు ఉన్నాయి.

కీలకమైన రహదారి..

- ఉత్తర తెలంగాణలోని మేడ్చల్, సిద్దిపేట, ఉమ్మడి కరీంనగర్, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాల్లో గల పలు జాతీయ రహదారులను కలిపే ఈ దారి అత్యంత కీలకమైంది.
- గత 13 ఏళ్ల క్రితం ఈ రోడ్డు విస్తరణకు రూ.1,450కోట్లకుపైగా వెచ్చించారు. బీఓటీ (బిల్ట్ ఆపరేటర్ ట్రాన్స్‌ఫర్) విధానంలో ఈ పనులు పూర్తి కావస్తున్నాయి.
- హైదరాబాద్ ఔటర్ రింగురోడ్డు, వరంగల్ హైవే, నేషనల్ హైవే 44 తదితర హైవేలతో పాటు కొత్తగా నిర్మించనున్న ట్రిపుల్‌ఆర్‌తోనూ ఈ రహదారి అనుసంధానం కానుంది.
- సిద్దిపేట జిల్లాలో ఈ రహదారి ములుగు మండలం వంటిమామిడి నుంచి శనిగరం వరకు 80కిలోమీటర్ల మేర విస్తరించింది.
- ఇంతటి ప్రాధాన్యత కలిగిన ఈ రహదారి పనులపై గత కొన్నేళ్లుగా ఫిర్యాదులు వెలువెత్తుతున్న సంగతి తెల్సిందే.
- ఈ రోడ్డుపై పలు చోట్ల మలుపులు సరిచేయకుండా విస్తరణ పనులు చేపట్టడంతో గడిచిన పదేళ్లలో సిద్దిపేట జిల్లాలో ఎన్నో రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకున్నాయి.
- ములుగు మండలం వంటిమామిడి, ములుగు మండల పరిషత్ కార్యాలయ సమీపం, గౌరారం, ప్రజ్ఞాపూర్‌లోని రాణే బ్రేక్‌లైనింగ్స్ ఫ్యాక్టరీ, రిమ్మనగూడ మలుపులు, కొడకండ్ల బ్రిడ్జి వద్ద, కొమురవెల్లి కమాన్, కొండపాక స్టేజీ, దుద్దెడ చౌరస్తాలో తరుచూ రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి.

సభా సంఘం ఏర్పాటు

- ఈ రోడ్డుపై మలుపులను సరిచేయడం అనివార్యంగా మారడంతో పదేళ్ల కిందట శాసన మండలిలో ఈ ప్రాంతానికి చెందిన పలువురు ఎమ్మెల్సీలు పనుల తీరుపై ప్రశ్నించారు. దీంతో రోడ్డు పరిశీలనకు సభా సంఘాన్ని నియమించారు.
- ఈ సభాసంఘం 2012 నవంబర్ 23, 24తేదీల్లో రాజీవ్ రహదారిపై మేడ్చేల్ జిల్లా శామీర్‌పేట నుంచి సిద్దిపేట, కరీంనగర్ మీదుగా మంచిర్యాల వరకు క్షేత్రస్థాయి పరిశీలన జరిపింది.
- ప్రజల నుంచి ఫిర్యాదులు, అభ్యంతరాలను స్వీకరించి ప్రభుత్వానికి నివేదించారు. అయినా రోడ్డు తీరులో ఎలాంటి మార్పులు చోటుచేసుకోలేదు.

హోదాతో భద్రత పెంపు

ఈ రహదారిపై ఉన్న మూలమలుపులు, వాహనాల రద్దీ పెరగడంతో పలు ప్రమాదాలకు కారణమవుతోంది. వీటి నివారణకు మలుపులను సరిచేస్తూ, ఆరు లేన్లుగా విస్తరణ అవశ్యంగా మారింది. చాలా ప్రదేశాల్లో జంక్షన్ల విస్తరించాల్సిన అవసరం ఉంది. దుద్దెడ, కొడకండ్ల, గౌరారం, ములుగు, రామునిపట్ల, ఇబ్రహీమ్ నగర్‌లో బైపాస్‌ల నిర్మాణ ప్రతిపాదన ముందుకెళ్లలేదు. గతంలో ఈ రహదారిపై సీఎం కేసీఆర్ ఒకటి రెండుసార్లు హైదరాబాద్‌లో జరిగిన ఉన్నతస్థాయి సమీక్షలో చర్చించినా ఫలితం లేదు. గతంలో ఈ రోడ్డును నిర్మించిన సంస్థకు మరికొన్నేళ్లు మెయింటనెన్స్ బాధ్యతలు ఉన్నందున.. ఆ సమయం ముగిసే వరకు ఎదురుచూడక తప్పదనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది.

సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలి

హుస్నాబాద్ ఎమ్మెల్యే సతీశ్‌కుమార్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సతీశ్‌కుమార్

హుస్నాబాద్: ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని ఎమ్మెల్యే సతీశ్ కుమార్ కార్యకర్తలకు పిలుపు నిచ్చారు. ఎమ్మెల్యే సతీశ్ కుమార్ అధ్యక్షతన ఆదివారం పట్టణంలో నిర్వహించిన బీఆర్‌ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కళ్యాణలక్ష్మి పథకం కింద లబ్ధిదారులకు రూ.100 కోట్లు అందించామని, తక్కువ సమయంలో గౌరవెల్లి ప్రాజెక్టును పూర్తి చేసుకున్నామని, నియోజకవర్గంలో 13 సబ్ స్టేషన్లు మంజూరు చేయించుకున్నామని అన్నారు. బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో రాష్ట్రంలో చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలను రానున్న రోజుల్లో కేసీఆర్ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా అమలు చేస్తామని పేర్కొన్నారు. వెనుకబడిన హుస్నాబాద్‌ను అభివృద్ధి చేసిన ఘనత బీఆర్‌ఎస్ ప్రభుత్వానిదేనని కొనియాడారు. రైతుబంధు, రైతు బీమా, 24 గంటల ఉచిత కరెంట్, ఆసరా పెన్షన్లు అమలు చేస్తూ ప్రజా సంక్షేమానికి కృషి చేస్తున్నామని వివరించారు. అనంతరం కోహెడ మండలం నకిరగొమ్ములకు చెందిన 50 మంది యువకులు పార్టీలో చేరగా, వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు కర్ర శ్రీహరి, హన్మకొండ జెడ్పీ చైర్మన్ సుధీర్‌కుమార్, మున్సిపల్ చైర్ పర్సన్ ఆకుల రజిత, కోహెడ జెడ్పీటీసీ శ్యామల, ఎంపీపీ మాజీ సభ్యుడు ఆకుల వెంకట్, తదితరులు ఉన్నారు.

ముగిసిన శతావధానం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): సిద్దిపేటలోని శ్రీలలితా చంద్రమౌళీశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవంలో భాగంగా నిర్వహించిన డాక్టర్ పట్వర్థన్ శతావధానం ఆదివారం రోజు ముగిసింది. నిషిద్ధాక్షరి, సమస్య, వర్ణన, దత్తపది, ఆశువు, అప్రస్తుతం తదితర అంశాలతో పచ్ఛకులు అడిగే వాటికి అవధాని పట్వర్ధన్ సమాధానమిచ్చారు. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపకుడు పండరి రాధాకృష్ణ, అయాచితం నటేశ్వర శర్మ, సింగీతం నరసింహారావు, సరస్వతి రామ శర్మ, ఉండ్రాళ్ళ రాజేశం, కంది శంకరయ్య, ఐతా చంద్రయ్య, మురళీధరశర్మ, లక్ష్మయ్య, శివకుమారశర్మ, వెంకటేశ్వర్లు, శ్రీచరణ్ సాయిదాస్, శరత్ బాబు, పవన్, లింగేశ్వరశర్మ, సంధ్యారాణి, మాధవీలత, మానస పాల్గొన్నారు.



శతావధాన కార్యక్రమంలో కవులు

స్మారకస్తూపాలు.. త్యాగాలకు ప్రతీకలు

తెలంగాణ సాహిత్య అకాడమీ మాజీ చైర్మన్ సిధారెడ్డి



అమరుల స్తూపం వద్ద ఉద్యమకారులు

మిరుదొడ్డి(దుబ్బాక): స్వరాష్ట్రం కోసం తొలి, మలి దశ ఉద్యమాల్లో ప్రాణ త్యాగం చేసిన అమరుల త్యాగాలకు స్మారక స్తూపాలు ప్రతీకలుగా నిలుస్తాయని తెలంగాణ ఉద్యమకారుడు, నంది అవార్డు గ్రహీత, రచయిత, సాహిత్య అకాడమీ మాజీ చైర్మన్ నందిని సిధారెడ్డి అన్నారు. మండలంలోని కొండాపూర్‌లో ఇటీవల నూతనంగా నిర్మించిన అమర వీరుల స్మారక స్తూపాన్ని మలి దశ ఉద్యమకారులతో కలిసి ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా స్తూపం వద్ద పూలమాలలు వేసి ఉద్యమకారులకు జోహార్లతో నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... కొండాపూర్‌లో స్మారక స్తూపం చూసిన తర్వాత తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో అమరులైన నాటి ఉద్యమ యోధులు, 1969 అమరులు, మలిదశ ఉద్యమంలో ఆత్మ బలిదానం చేసిన ఉద్యమకారుల త్యాగాలు, పోరాటాలు గుర్తుకు వస్తున్నాయన్నారు. మారుమూల ప్రాంతమైన కొండాపూర్‌లో స్తూపాన్ని నిర్మించడం అభినందనీయమన్నారు. రాష్ట్ర సాధన అమరుల త్యాగ ఫలితంగానే సిద్ధించిందని, అమరుల త్యాగాలు, పోరాటాలను ప్రతీ పల్లె గుర్తుంచుకునేలా స్తూపాలను నిర్మించాలని కోరారు. కార్యక్రమంలో సిద్దిపేట జిల్లా జేఏసీ చైర్మన్ పాపయ్య, మలిదశ ఉద్యమకారులు తిరుపతిరెడ్డి, నర్సింహారెడ్డి, భిక్షపతి, శ్రీనివాస్‌రెడ్డి, ప్రభాకర్, పెద్దిరాజు, అందె ప్రవీణ్, రామచందర్ రావు, యాదగిరి, నర్సింహారెడ్డి పాల్గొన్నారు.

మల్లన్న ఆలయం.. భక్తజన సంద్రం

భక్తుల ప్రత్యేక పూజలు



రాజగోపురం ఎదుట భక్తుల సందడి

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి మల్లన్న ఆలయం ఆదివారం భక్తులతో కిక్కిరిసిపోయింది. ఎనిదో వారం సుమారు 35 వేల భక్తులు తరలివచ్చిస్వామి వారిని దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. వచ్చే వారం బ్రహ్మోత్సవాలు ముగియనుండడంతో వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలి వచ్చారు. శనివారం సాయంత్రమే ఆలయానికి చేరుకున్న భక్తులు ఉదయం పుష్కరిణిలో స్నానాలు ఆచరించి స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులు అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజలు, పట్నాలు వేసి, ఒడిబియ్యం పోసి, కేశఖండన, గంగిరేణి చెట్టువద్ద పట్నాలు వేసి, ముడుపులు కట్టి మొక్కులు తీర్చుకున్నారు. మట్టి కుండల్లో బోనం తయారు చేసి కొండపై రేణుక ఎల్లమ్మ తల్లికి సమర్పించారు. కొంత మంది భక్తులు రాతి గీరల వద్ద ప్రదక్షిణలు, కోడెల స్తంభం వద్ద కోడెలు కట్టి పూజలు చేశారు. బోనాలు డప్పు చప్పుళ్లతో ఆలయ పరిసరాలు మారుమోగాయి. స్వామి దర్శనానికి సుమారు 4 గంటల సమయం పట్టింది. భక్తులకు కావాల్సిన సౌకర్యాలను ఆలయ చైర్మన్ గీస భిక్షపతి, ఆలయ ఈఓ బాలాజీ ఏఈఓ అంజయ్య, సూపరింటెండెంట్ నీల శేఖర్, ఆలయ ఉద్యోగులు నర్సింహులు, అంజయ్య, ఆలయ ధర్మకర్తలు పర్యవేక్షించారు.

మాజీ ఎంపీ పొన్నం పూజలు

కొమురవెల్లి మల్లికార్జున స్వామిని ఆదివారం మాజీ ఎంపీ, కాంగ్రెస్ నాయకులు పొన్నం ప్రభాకర్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి పట్నాలు వేసి మొక్కులు చెల్లించుకున్నారు.



నాచగిరిలో ధ్వజారోహణ కార్యక్రమం నిర్వహిస్తున్న రుత్వికులు

ధ్వజారోహణం.. నేత్రపర్వం

- వైభవంగా నాచగిరీశుని బ్రహ్మోత్సవాలు
- గరుడాళ్వారుకు విశేష పూజలు
- నేడు స్వామివారి తిరుకల్యాణోత్సవం

వర్గల్(గజ్వేల్): ధ్వజారోహణ మహోత్సవంతో నాచగిరి పరవశించింది. ముక్కోటి దేవతలకు శ్రీలక్ష్మీ నృసింహస్వామివారి నవాహ్నిక బ్రహ్మోత్సవ ఆహ్వానం చేరింది. అంగరంగ వైభవంగా సాగుతున్న శ్రీవారి బ్రహ్మోత్సవ వేడుకలు భక్తజనావళిని మంత్ర ముగ్ధులను చేస్తున్నాయి. సుప్రసిద్ధ నాచారం గుట్ట శ్రీలక్ష్మీ నృసింహక్షేత్రంలో ఆదివారం రెండోరోజు గరుడ ధ్వజారోహణం అత్యంత వైభవంగా జరిగింది. గర్భగుడిలో మూలవిరాట్టులకు పంచామృతాభిషేకం, అనంతరం స్వామివార్లను సర్వాభరణాలు, పట్టువస్త్రాలు, పూలమాలలతో అలంకరించి, విశేష పూజలు నిర్వహించారు. అనంతరం శ్రీలక్ష్మీ సమేత నృసింహుడిని పల్లకిలో ధ్వజస్తంభం వద్దకు తీసుకువచ్చి పూజలు చేశారు. ధ్వజస్తంభం వద్ద రాగ, తాళ యుక్తంగా గరుడ పతాకానికి పూజలు నిర్వహించి, గరుడ ముద్దలు ఎగరేస్తూ నైవేద్యం సమర్పించారు. యాగశాలలో సంప్రోక్షణ జరిపి హోమం చేసి, స్వామివారి కల్యాణానికి సన్నాహ సూచికగా సాయంత్రం సకలదేవతాహ్వానం పలుకుతూ భేరీపూజ నిర్వహించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి 10 గంటలకు శ్రీలక్ష్మీనృసింహస్వామివారి తిరుకల్యాణోత్సవం నిర్వహించనున్నారు.

కల్యాణ మండపం ఏర్పాటు

క్షేత్రంలో భక్తులు బసచేసేందుకు అవసరమైన సౌకర్యాల కల్పనకు దాతలు ముందుకొచ్చారు. ఆలయంలో వ్రతాల కోసం రాజనర్సింగరావు–ఉమామహేశ్వరి దంపతులు వ్రతమండపం, అన్నదాన సత్రం, షెడ్డును ఏర్పాటు చేయగా, తిర్కాల పండరి ముదిరాజ్ సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు షెడ్డును నిర్మింపజేశారు. మురళీ మనోహర్‌రావు ఆధ్వర్యంలో సాయిబాబ ఆలయ ప్రాంగణంలో షెడ్డు, రామబ్రహ్మం ఆధ్వర్యంలో అద్దాల మండప నిర్మాణం, మేడోజు సంగమేశ్వర్ తూర్పు ద్వారం, రాచమల్ల నాగేశ్వర్ రావు విమానగోపురాన్ని, గార్లపాటి నర్సింగ రావు, చింతల మల్లేషం గౌడ్ యాగశాల ఏర్పాటుకు ముందుకు వచ్చారు. ప్రసాదాల తయారీకి రామానుజ కూటంను లక్ష్మణ్‌రావు, గిరిప్రదక్షిణ మండపం, కోనేరు మార్గంలో ముఖద్వారం రుద్ర శ్రీహరి నిర్మింపజేశారు. కల్యాణం వీక్షించేందుకు షెడ్డును మల్లంపేట నర్సింహచారి ఏర్పాటు చేశారు. ఆదివారం ప్రత్యేక పూజలు చేసి స్వామివారికి అర్పితం చేశారు.

ఆలయాల అభివృద్ధికి పెద్ద పీట

ఎఫ్‌డీసీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి



పూజలు చేస్తున్న ప్రతాప్‌రెడ్డి

మర్కూక్(గజ్వేల్): సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో పల్లెల్లో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుందని రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి అన్నారు. ముదిరాజ్ ఆధ్వర్యంలో మర్కూక్‌లో ఆదివారం నిర్వహించిన పెద్దమ్మ పెద్దరాజుల కల్యాణోత్సవంలో పాల్గొని పూజలు చేశారు. సీఎం కేసీఆర్ ముదిరాజ్‌ల అభివృద్ధికి కృషి చేస్తున్నారని, చేపపిల్లల పంపిణీతో ఆర్థిక అభివృద్ధికి పాటుపడుతున్నారని అన్నారు. ముదిరాజ్‌ల కులదైవం పెద్దమ్మ ఆలయ అభివృద్ధిపై సీఎం, మంత్రి హరీశ్‌రావు దృష్టికి తీసుకువెళ్లి నిధులు మంజూరు చేయిస్తానని తెలిపారు. గ్రామాల్లో చెరువు, కుంటలు నిండుగా ఉన్నాయని, వాటిలో చేపలతో ముదిరాజ్‌లకు ఉపాధి లభిస్తుందని అన్నారు. అనంతరం ప్రతాప్‌రెడ్డిని ఆలయ ఉత్సవ కమిటీ నిర్వహకులు శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ పాండుగౌడ్, జెడ్పీటీసీ మంగమ్మ, సర్పంచ్ భాస్కర్, వంటి మామిడి మార్కెట్ కమిటీ డైరెక్టర్ ప్రవీణ్, ఎంపీటీసీ చైతన్య శంకర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ రాంరెడ్డి, ముదిరాజ్ సంఘం నాయకులు సత్యానారాయణ, నర్సింలు, కనకయ్య, రాజు తదితరులు పాల్గొన్నారు.

దోమల మోత.. ఫ్లూ వ్యాప్తి

- పని చేయని ఫాగింగ్ యంత్రాలు
- చెత్తతో నిండిన మురికి కాల్వలు
- స్వైరవిహారం చేస్తున్న పందులు
- ఆందోళనలో జిల్లా ప్రజలు



హుస్నాబాద్ పట్టణంలో పారుతున్న మురికి కాలువ

సాక్షి, సిద్దిపేట: పట్టణాలు దోమల రాజ్యంలా మారిపోతూ.. ప్రజలకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపడుతున్నామని మున్సిపల్ అధికారులు చెబుతున్నా.. క్షేత్ర స్థాయిలో మాత్రం ఆ దాఖలాలు కనిపించడం లేదు. ప్రస్తుతం ఫ్లూ విస్తరిస్తుండటంతో ప్రతీ ఇంట్లో జ్వరం, బాడీ పెయిన్స్, జలుబుతో బాధపడుతున్నారు. దీంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు.

అంతంతమాత్రంగానే..

- జిల్లాలోని ఐదు మున్సిపాలిటీల్లో 115 వార్డుల్లో 2,96,880 మంది జనాభా ఉన్నారు.
- వార్డుల్లో రెండు రోజులకు ఒకసారైనా ఫాగింగ్ చేయాల్సిన అవసరం ఉన్నా.. అది ఎక్కడా అమలు కావడంలేదు.
- సిద్దిపేట మున్సిపాలిటీలో పెద్దది ఒకటి, ఐదు చిన్న ఫాగింగ్ మిషన్లు ఉండగా, అందులో ఒకటి మిషన్ మాత్రమే పని చేస్తుంది.
- వాహనం ద్వారా రోజుకు రెండు వార్డుల చొప్పున ఫాగింగ్ చేస్తున్నారు.
- ఒక్క వార్డులో ఫాగింగ్ చేసిన తర్వాత 20 రోజుల తర్వాత మళ్లీ ఫాగింగ్ చేస్తున్నారు. దోమల వ్యాప్తి విపరీతంగా పెరుగుతోంది.
- గజ్వేల్ మున్సిపాలిటీలో మూడు ఫాగింగ్ యంత్రాలతో ఒక్కో వార్డులో పదిరోజులకోసారి ఫాగింగ్ చేస్తున్నారు.

అపరిశుభ్రంగా మురికి కాల్వలు

హుస్నాబాద్ మున్సిపాలిటీలో ప్రతీ రోజు రెండు వార్డుల చొప్పున ఫాగింగ్ చేస్తున్నారు. అదే వార్డుకు మళ్లీ ఫాగింగ్ చేయాలంటే కనీసం పది రోజుల సమయం పడుతోంది. దుబ్బాక బల్దియాలో రోజుకు రెండు వార్డుల్లో ఫాగింగ్ చేస్తున్నారు. చేర్యాల మున్సిపాలిటీలోనూ ఉన్న ఒక్క మిషన్‌తో ఒక్కో వార్డులో వారానికి ఒకసారి ఫాగింగ్ చేస్తున్నారు. ఈ మూడు మున్సిపాలిటీల పరిధిలో మురికి కాల్వలను సకాలం శుభ్రం చేయకపోవడంతో పరిసరాలు దుర్గంధంతో నిండుతున్నాయి. పందులు స్వైరవిహారం చేస్తూ రోగాల వ్యాప్తికి కారణమవుతున్నాయి.

చాపకింద నీరులా..

ఇలా గ్యాప్ ఇచ్చి ఫాగింగ్ చేస్తుండటంతో దోమల వ్యాప్తి విపరీతంగా పెరుగుతోంది. దీంతో రాత్రి వేళ ఇళ్ల నుంచి బయటకు వెళ్లాలంటే జంకుతున్న పరిస్థితి. దీనికితోడు చాపకింద నీరులా ఫ్లూ విస్తరిస్తుండటంతో ఆందోళన మరింత పెరుగుతుంది. దోమల నుంచి రక్షణ పొందేందుకు ఇళ్లల్లో దోమల నివారణకు కాయిల్స్, లిక్విడ్‌ను, ఎలక్ట్రానిక్ బ్యాట్‌లను విరివిగా వినియోగిస్తున్నారు. పడుకునే సమయంలో పక్కనే పెట్టుకోవాల్సిన పరిస్థితి దాపురించింది. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

మున్సిపాలిటీ	వార్డులు	ఇళ్లు	జనాభా
సిద్దిపేట	43	41,322	1,57,026
గజ్వేల్	20	11,616	55,616
హుస్నాబాద్	20	8,350	29,115
దుబ్బాక	20	8,500	35,000
చేర్యాల	12	5,920	20,123

వేగలేకపోతున్నాం



మురికి కాల్వలు శుభ్రం చేయకపోవడంతో మురికి కాల్వల్లో దోమలు, పందులు స్థావరం ఏర్పరుచుకుంటున్నాయి. దీంతో అనారోగ్యాలకు గురి అవుతున్నాం. ఫాగింగ్ చేయాలని అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదు.

– బదుగు రమేశ్, టీచర్ కాలనీ, హుస్నాబాద్

నిత్యం నరకయాతనే..



దుబ్బాకలో దోమల బెడద తీవ్రంగా ఉంది. ఇంట్లో ఉంటే దోమలు బయటకొస్తే పందులు, కుక్కలతో చాలా ఇబ్బందులు పడుతున్నాం. అధికారులకు చెప్పినా పట్టించుకోవడంలేదు.

– శ్రీకాంత్, 16వ వార్డు, దుబ్బాక

క్లుప్తంగా

కోతుల దాడిలో యువకుడికి గాయాలు

నర్సాపూర్: కోతులు దాడి చేయడంతో ఓ యువకుడికి గాయాలయ్యాయి. బాధితుడు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని శివాలయం వీధిలో ఉన్న వాసు ఆదివారం తన ఇంటి నుంచి బయటకు రాగానే కోతులు దాడి చేయడంతో గాయపడ్డాడు. వెంటనే ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి వెళ్లి వైద్యం చేయించుకున్నాడు. గతంలో కూడా తమ కుటుంబీకులపై కోతులు దాడి చేశాయని తెలిపాడు. కోతుల బెడద లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరాడు.

గాయపడిన మహిళ ఆస్పత్రికి తరలింపు

కొమురవెల్లి(సిద్దిపేట): బైక్‌పై నుంచి కిందపడిన మహిళను 108లో ఆసుపత్రికి తరలించారు. ఈఘటన మండల కేంద్రంలో ఆదివారం చోటుచేసుకుంది. 108 సిబ్బంది తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. జనగామ జిల్లా కొడకండ్ల మండలం మొండ్రాయి గ్రామానికి కొమ్ము అనిత కుటుంబ సభ్యులతో బైక్‌పై వచ్చి కొమురవెల్లి మల్లికార్జున స్వామి దర్శించుకుంది. తిరుగుప్రయాణంలో బైక్ పైనుంచి కింద పడటంతో కుడికాలు విరిగినది. స్థానికులు వెంటనే 108కు సమాచారం ఇచ్చారు. వారు సంఘటన స్థలానికి చేరుకొని ప్రథమ చికిత్స చేసి జనగామ జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

అనారోగ్యంతో బాధపడుతున్న కూతురు

మనోవేదనతో తండ్రి ఆత్మహత్య

కోహెడరూరల్(హుస్నాబాద్): అనారోగ్యానికి గురైన కూతురుకు వైద్యం చేయించినా నయం కాకపోవడంతో మనోవేదనతో తండ్రి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్ఐ నరేందర్‌రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని తంగళ్లపల్లి గ్రామానికి చెందిన ఓంకారం శివకుమార్(58) చిన్న కూతురు అనారోగ్యంతో బాధపడుతోంది. వైద్యం చేయించినా నయం కావకపోవడంతో నిత్యం బాధపడుతుండేవాడు. ఆదివారం ఉదయం ఇంట్లో ఎవరు లేని సమయంలో ఉరి వేసుకొన్నాడు. మృతుడి భార్య సుక్కబాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

16 మేకల అపహరణ

పటాన్‌చెరు టౌన్: గుర్తుతెలియని దుండగులు మేకలను ఎత్తుకెళ్లిన సంఘటన భానూర్–బీడీఎల్ పోలీసు స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ మహేశ్వర్ రెడ్డి కథనం ప్రకారం వివరలు ఇలా ఉన్నాయి. పటాన్‌చెరు మండలం క్యాసారం గ్రామానికి చెందిన నర్సింహులు, అదే గ్రమానికి చెందిన అంతయ్య పొలంలో ఎప్పటిలాగే శనివారం రాత్రి 24 మేకలను ఉంచి ఇంటికి వెళ్లాడు. ఆదివారం ఉదయం వచ్చి చూడగా ఎనిమిది మేకలు మాత్రమే ఉన్నాయి. 16 మేకలను గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లినట్లు గ్రహించి బీడీఎల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

కవితక్క జోలికొస్తే ఊరుకోం

హత్నూర (సంగారెడ్డి): కవితక్క జోలికొస్తే ఊరుకోబోమని జాగృతి జిల్లా అధ్యక్షుడు దండు ప్రవీణ్ రావు హెచ్చరించారు. ఆదివారం కస్తూరి మండలం దౌల్తాబాద్‌లో మాట్లాడుతూ జాగృతి జాతీయ అధ్యక్షురాలు ఎమ్మెల్సీ కవితనుద్దేశించి అసభ్యకరంగా మాట్లాడితే బీజేపీ నాయకులను గ్రామాల్లో తిరగనివ్వమని ఆయన హెచ్చరించారు.

ప్లాస్టిక్‌తో పర్యావరణానికి ముప్పు

- విచ్చలవిడిగా ఫ్లెక్సీల ఏర్పాటు, మున్సిపల్ ఆదాయానికి గండి
- స్వచ్ఛ సర్వేక్షణ్‌లో మున్సిపల్‌కు రెండు జాతీయ అవార్డులు
- స్వచ్ఛ సర్వేక్షణ్ పేరిట ప్లాస్టిక్ వాడకంపై విమర్శలు



హుస్నాబాద్‌లోని అంబేడ్కర్ చౌరస్తాలో ఫ్లెక్సీలు ఏర్పాటుచేసిన దృశ్యం

హుస్నాబాద్: స్వచ్ఛ సర్వేక్షణ్‌లో హుస్నాబాద్ మున్సిపాలిటీ రెండుసార్లు జాతీయ అవార్డులు సాధించింది. మూడో సారీ జాతీయ అవార్డు పొందాలని తహతహలాడుతోంది. పేరుకు స్వచ్ఛ పట్టణం, క్షేత్ర స్థాయిలో అంతా అధ్వానం. ఎక్కడ చూసినా ఫ్లెక్సీలమయం. అన్ని పార్టీలు వీటి ఏర్పాటుకు అతీతం కాదు. హుస్నాబాద్‌లో స్వచ్ఛ సర్వేక్షణ్‌కు అంతా విరుద్ధంగా సాగుతుంది. ప్రతీ దుకాణంలో ప్లాస్టిక్ సంచులవాడకం పరిపాటిగా మారింది. నామమాత్రాంగానే దుకాణాల్లో అధికారులు తనిఖీలు చేయడం, జరిమానాలు విధించి చేతులు దులుపుకుంటున్నారు. ముఖ్యంగా వాతావరణ కాలుష్య నియంత్రణకు ప్లాస్టిక్ బ్యాగులు వాడకం, ఫ్లెక్సీల ఏర్పాటుపై ప్రభుత్వం నిషేధం విధించింది. పట్టణంలో ఫ్లెక్సీల ఏర్పాటు ఆనవాయితీగా మారింది. రాజకీయ నాయకుల పర్యటనలు, అభివృద్ధి కార్యక్రమాలు, శంకుస్థాపనలు, సంబరాలు, జన్మదిన శుభాకాంక్షలు కార్యక్రమం ఏదైనా వీటిని ఏర్పాటు చేస్తూ ప్రచారం చేసుకుంటున్నారు. వ్యాపార, వాణిజ్య ప్రచారానికి ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తున్నారు. వీటి ఏర్పాటుతో పర్యావరణానికి ముప్పు వాటిల్లే ప్రమాదం ఉంది.

ప్లాస్టిక్‌పై నిషేధం

- మున్సిపల్, ఇతర పట్టణాలు, ముఖ్య నగరాల్లో వాతావరణ సమతుల్యం కోసం ప్లాస్టిక్, ఫ్లెక్సీలు నిషేధించామని మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ చెప్పారు. ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తే జరిమానాతో పాటు వాటిని తొలగించాలని ఆదేశించారు. హుస్నాబాద్‌లో హోర్డింగ్‌లకు అనుమతి ఇచ్చారు. ప్రతీనెల హోర్డింగ్‌లు ఏర్పాటు చేసిన వారి నుంచి పన్నులు వసూలు చేస్తున్నారు.
- ఇక పొలిటికల్ విషయానికి వచ్చేసరికి పట్టణమంతా ఫ్లెక్సీలమయమవుతోంది. అధికార పార్టీ నాయకులు ఫెక్సీలు ఏర్పాటు చేయడాన్ని ఆసరాగా తీసుకొని ప్రతిపక్షాలు, ఇతర ప్రజా సంఘాలు ఏర్పాటు చేస్తున్నారు. వీరి చర్యలతో వాతావరణ కాలుష్యానికి ఆజ్యం పోస్తున్నారు. ప్రభుత్వ నిబంధనలను లెక్కచేయడంలేదు.

ఏ ప్రాంతంలోనేనా..

- హుస్నాబాద్ పట్టణంలో ఏ ప్రాంతంలోనేనా ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలంటే మున్సిపల్ శాఖ అనుమతి తప్పని సరి.
- కేవలం హోర్డింగ్‌లు మినహా మిగితా చోట్ల రోడ్లకు ఇరువైపులా వీటిని ఏర్పాటు చేస్తున్నా మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదు.
- ఎందుకంటే అధికార పక్షం ఏదో సందర్భంలో ఫెక్సీలు ఏర్పాటు చేయడం వల్ల వారి నుంచి పన్నులు వసూలు చేసే సహసం చేయకపోవడమే. ఇదే అదను చేసుకొని వీటిని ఏర్పాటు చేస్తున్నా అధికారులు మౌనం పాటించడం తప్ప చేసేదేమి లేదు.
- పట్టణంలోని మెయిన్‌రోడ్‌లోని డివైడర్లు, సెంట్రల్ లైటింగ్ స్తంభాలకూ ఫ్లెక్సీల తాకిడి తప్పడం లేదు.
- రోడ్లపై, దుకాణాల ఎదుట ఏర్పాటు చేయడం వల్ల వాహనాల రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్నాయి.
- ఒక ఫ్లెక్సీ కట్టాలంటే రూ.వెయ్యి పైగా ఖర్చవుతుంది.
- ఫ్లెక్సీలు తయారు చేసేవారికి, వాటిని కట్టివారికి ఆదాయం వస్తుంటే మున్సిపల్‌కు మాత్రం శూన్యమే.
- వచ్చేది ఎన్నికల సీజన్, ఇప్పుడు కట్టడి చేయలేకపోతే వాతావరణ కాలుష్యభారం ప్రజలు మోయాల్సి ఉంటుంది.
- స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా హుస్నాబాద్ పట్టణం అతివేగంగా అభివృద్ధి చెందుతున్న పట్టణంగా, బెస్ట్ సిటీ ఇన్ సిటిజన్స్ ఫీడ్ బ్యాక్ కేటగిరి కింద మున్సిపల్‌కు జాతీయ అవార్డులు వరించాయి.
- స్వచ్ఛ సర్వేక్షణ్ అంటే రోడ్లపై విచ్చలవిడిగా ఫెక్సీలు ఏర్పాటు చేయడం, ప్లాస్టిక్ వాడటమా అని స్థానికుల నుంచి విమర్శలు వెలువెత్తుతున్నాయి. ఇందుకు అందుకు తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

ప్లాస్టిక్ బ్యాగులను నిషేధించాం



హుస్నాబాద్‌లో ప్లాస్టిక్ బ్యాగుల వాడకాన్ని నిషేధించాం. ప్రతీ దుకాణంలో తనిఖీలు చేస్తున్నాం. వాడేవారికి, విక్రయించేవారికి జరిమానాలు విధిస్తున్నాం. 120 మైక్రాన్లు ఉన్న ప్లాస్టిక్ సంచులను నిషేధించాం. ర్యాలీల ద్వారా అవగాహన కల్పిస్తున్నాం. గత ఏడాది జూలై నుంచి నేటి వరకు రూ.25 వేల జరిమాన విధించాం. ఫ్లెక్సీల ఏర్పాటుకు అనుమతి లేదు. కేవలం హోర్డింగ్‌లకు మాత్రమే అనుమతి ఇచ్చి పన్ను వసూలు చేస్తున్నాం. రాజకీయ పార్టీలు ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తుండటం వాస్తవమే. ఇకపై ఎవరు ఏర్పాటు చేసినా వాటిని తొలగిస్తాం.

– సుంకె రాజమల్లయ్య, కమిషనర్, రాజమల్లయ్య, హుస్నాబాద్

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడి కారు దగ్ధం

దుబ్బాక: షార్ట్ సర్క్యూట్‌తో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడి కారు దగ్ధమైంది. ఆదివారం దుబ్బాక ఎస్ఐ బత్తుల మహేందర్ కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. దుబ్బాక పట్టణానికి చెందిన బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అంబటి బాలేశ్‌గౌడ్ తన టాటా విస్టా కారును నిత్యం పట్టణంలోని ఏపీజీవీబీ ఎదుట పార్కింగ్ చేసేవాడు. శనివారం 12.30 గంటల సమయంలో కారులో నుంచి మంటలు రావడంతో అటుగా వెళ్లే వాహనదారులు స్థానికులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేసే ప్రయత్నం చేసినా ఫలితం లేకపోయింది. గుర్తు తెలియని వ్యక్తులు తన కారును తగులబెట్టారని బాలేశ్ గౌడ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు చేపట్టారు. పోలీసులు సీసీటీవీ ఫుటేజిని పరిశీలించారు. కారులో ప్రమాదవశాత్తు షార్ట్ సర్క్యూట్ జరిగి దగ్ధమైనట్లు పోలీసుల ప్రాథమిక విచారణలో తేలింది. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కారు కాలిపోయిన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే రఘునందన్ రావు సంఘటనా స్థలానికి వచ్చి కారును, పరిసరాలను పరిశీలించారు.



వివరాలునమోదు చేసుకుంటున్న పోలీసులు

గొర్రెల మందపై కుక్కల దాడి

మనోహరాబాద్(తూప్రాన్): గొర్రెల మందపై కుక్కల దాడి చేయడంతో రెండు మృతి చెందగా, ఐదింటికి గాయాలయ్యాయి. ఆదివారం స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని రంగాయపల్లి గ్రామస్తుడు గౌరాయ చిన్న ఆగయ్యకు చెందిన గొర్రెల కొట్టంలోకి శనివారం రాత్రి కుక్కలు జొరబడి దాడిచేయడంతో రెండు గొర్రెలు మృతి చెందగా, ఐదింటికి గాయాలయ్యాయి. గొర్రెలు మృతి చెందడంతో తనకు నష్టం వాటిల్లినట్లు బాధితుడు తెలిపాడు.



కుక్కల దాడిలో గాయపడిన గొర్రెలు

చికిత్స పొందుతున్న ముగ్గురి మృతి

వేర్వేరు చోట్ల ముగ్గురు చికిత్స పొందుతూ మరణించారు. ఇంటి నుంచి పొలానికి వెళ్తున్న రైతు బైక్ అదుపు తప్పడంతో రోడ్డుపై పడి మృతి చెందాడు. అలాగే ఒడిశా రాష్ట్రానికి చెందిన నలుగురిలో ఒకరు అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. మరో ముగ్గురు గాయపడ్డారు. మరో చోట పొలానికి గడ్డిమందు కొట్టి చేతులు శుభ్రం చేసుకోకుండా భోజనం చేశాడు. వెంటనే వాంతులు చేసుకుంటూ కిందపడిపోయాడు. కుటుంబ సభ్యులు వెంటనే ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు.



యాదగిరి (ఫైల్)

కొమురవెల్లి(సిద్దిపేట): బైక్‌పై నుంచి కిందపడి గాయపడిన వ్యక్తి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన చెక్క యాదయ్య(38)హోలీ పండగరోజు తిమ్మారెడ్డిపల్లి రోడ్డులో ఉన్న తన పొలానికి బైకుపై వెళ్తుండగా అదుపు తప్పి బైక్ పై నుంచి కింద పడిపోయాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు సంఘటనా స్థలానికి చేరుకుని యాదయ్యను హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో శనివారం గాంధీ ఆసుపత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మృతి చెందాడు. మృతుడికి భార్య మంజుల, ఇద్దరు పిల్లలు అఖిల్, భార్గవి ఉన్నారు.

పటాన్‌చెరు టౌన్: తెల్లాపూర్ మున్సిపల్ పరిధి ఈదులనాగులపల్లిలో ఒడిశా రాష్ట్రానికి చెందిన నలుగురు నివాసం ఉంటున్నారు. ఈనెల 5వ తేదీ రాత్రి వారిలో బిస్వనాథ్‌దలై అలియాస్ బిసుదలై అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. వారిని చికిత్స కోసం సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి, మెరుగైన చికిత్స కోసం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు భానూర్–బీడీఎల్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్న విషయం తెలిసిందే. ఉస్మానియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న అబిదలై(40) ఆదివారం మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తరలించారు. కేసును దర్యాప్తు చేస్తున్నారు.



రత్న ప్రసాద్ (ఫైల్)

పాపన్నపేట(మెదక్): పొలానికి గడ్డిమందు చల్లి చేతులు శుభ్రం చేసుకోకుండా భోజనం చేశాడు. కొద్ది సేపటికి వాంతులు చేసుకుని కిందపడ్డాడు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. పాపన్నపేట ఎస్ఐ విజయ్ కుమార్ కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధి లక్ష్మీనగర్ గ్రామానికి చెందిన జాలాది రత్న ప్రసాద్ (46) వ్యవసాయం చేస్తున్నాడు. శుక్రవారం పొలానికి గడ్డి మందు చల్లాడు. చేతులు శుభ్రం చేసుకోకుండానే భోజనం చేశాడు. కొద్ది సేపటికే వాంతులు చేసుకుంటూ కింద పడిపోయాడు. వెంటనే అతడిని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ తరలించారు. అక్కడ చికిత్సపొందుతూ చెందాడు. భార్య మాధవి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఇద్దరు వృద్ధుల అదృశ్యం

వేర్వేరు చోట్ల ఇద్దరు వృద్ధులు అదృశ్యమయ్యారు. షాపు నుంచి ఇంటికి బయలుదేరిన వృద్ధుడు ఇంటికి చేరలేదు. అలాగే దేవాలయంలో నిద్రించేందుకు వెళ్లిన వృద్ధురాలు కనిపించకుండా పోయింది.



సొనెల రాం (ఫైల్)

సంగారెడ్డి టౌన్: ఇంటి నుంచి వెళ్లిన వృద్ధుడు కనిపించకుండా పోయాడు. ఈ సంఘటన సంగారెడ్డి మండలంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. బీహార్ రాష్ట్రం మహమ్మద్‌పుర గ్రామానికి చెందిన సొనెలరాం (60) తన కుటుంబ సభ్యులతో కలిసి సంగారెడ్డిలోని నారాయణ రెడ్డి కాలనీలో నివాసం ఉంటున్నాడు. పోతిరెడ్డి పల్లిలోని ఓ షాపులో పనిచేస్తున్నాడు. ఈనెల 10వ తేదీన సాయంత్రం విధులు ముగించుకొని ఇంటికి వెళ్తున్నట్లు చెప్పి వెళ్లాడు. ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు అతడి ఆచూకీ కోసం పలుచోట్ల వెతికిన లాభం లేకుండా పోయింది. దుకాణానికి రాకపోవడంతో షాపు యజమాని మాణిక్ ప్రభు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని రూరల్ పోలీసులు తెలిపారు. ఆచూకీ తెలిసినవారు 87126 56746, 79011 48920 నంబర్‌కు వివరాలు తెలపాలని కోరారు.

ఇంటి నుంచి వెళ్లి..



వడ్డే సంగమ్మ

కంది(సంగారెడ్డి): వృద్ధురాలు అదృశ్యమైన సంఘటన మండలకేంద్రమైన కందిలో చోటుచేసుకుంది. రూరల్ ఎస్ఐ శ్రీనివాస్ రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కందికి చెందిన వడ్డే సంగమ్మ(70) ఈనెల 8వ తేదీ రాత్రి ఇంటికి సమీపంలోగల శ్రీపాండురంగస్వామి ఆలయంలో నిద్రించేందుకు వెళ్లి తిరిగిరాలేదు. ఆమె ఆచూకీ కోసం కుటుంబ సభ్యులు వెతికినా జాడతెలియరాలేదు. సంగమ్మ కూతురు వడ్డే నర్సమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. సంగమ్మ ఆచూకీ తెలిసిన వారు రూరల్ పోలీస్‌స్టేషన్ 8712656746, 7901148908 నంబర్లకు ఫోన్ చేసి తెలియజేయాలన్నారు.

కారును ఢీకొన్న టిప్పర్

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని అంతారం సమీపం దూసకుంట మలుపు వద్ద కారును టిప్పర్ లారీ ఢీకొంది. ఈసంఘటన ఆదివారం రాత్రి జరిగింది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం చిలప్‌చెడ్ మండలం అంతారం గ్రామానికి చెందిన ఈశ్వరయ్య కుటుంబ సభ్యులు ఆసుపత్రి నుంచి కారులో ఇంటికి వస్తున్నారు. అంతారం గ్రామ సమీపంలో దూసకుంట మలుపు వద్ద వెనక నుంచి టిప్పర్ లారీ కారును ఢీకొంది. ఈ ఘటనలో ఎవరూ గాయపడలేదు. టిప్పర్ లారీని గ్రామానికి తరలించారు. ఈ ఘటనలో ఎవరూ గాయపడకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

గుండెపోటుతో వ్యక్తి మృతి



సత్యనారాయణ (ఫైల్)

తూప్రాన్: గుండెపోటుతో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని యావపూర్ పంచాయతీ పరిధి తడ్కపల్లిలో శనివారం చోటు చేసుకుంది. మంత్రి సత్యనారాయణ(45) శనివారం రాత్రి భోజనం చేస్తున్న క్రమంలో కుప్పకూలిపోయాడు. వెంటనే భార్య నాగలక్ష్మి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లింది. గుండెపోటుతో మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

చేపలు పట్టేందుకు వెళ్లి ఇద్దరి మృత్యువాత

వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు చేపలు పట్టేందుకు వెళ్లారు. ఒకరు వల తీసుకుని చెరువులో వెళ్తుండగా లోతు ఎక్కువగా ఉండటంతో వలలో చిక్కి మృతి చెందాడు. మరో చోట చేపలు పట్టేందుకు విసిరిన వలలో చిక్కుకొని ప్రాణాలు కోల్పోయాడు.



పటాన్‌చెరు టౌన్: శాంతయ్య మృతదేహాన్ని బయటకు తీస్తున్న దృశ్యం

కొల్చారం(నర్సాపూర్): చేపలు పట్టేందుకు వెళ్లిన మత్స్యకారుడు ప్రమాదవశాత్తు వలలో చిక్కుకుని నీటమునిగి మృత్యువాత పడ్డాడు. ఈ సంఘటన కొల్చారం మండలం అంసాన్‌పల్లి గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. కొల్చార ఏఎస్ఐ తారాసింగ్, మృతుడి కుటుంబసభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన మృతుడు గొల్పల పొట్టి వెంకటయ్య (58) ఆదివారం మధ్యాహ్నం గ్రామ సమీపంలోని చౌదరి చెరువులో చేపలు పట్టేందుకు వెళ్లాడు. చెరువు లోతుగా ఉండటం, చేపల కోసం విసిరిన వల అతడి కాళ్లకు చుట్టుకోవడంతో నీట మునిగిప్యాడు. ఈ క్రమంలో అటుగా వెళ్తున్న వ్యక్తులు గమనించి గ్రామస్తులకు సమాచారం ఇచ్చారు. హుటాహుటిన వారు అక్కడికి చేరుకుని వెంకటయ్యను ఒడ్డుకు చేర్చినా అప్పటికే ఊపిరాడక మృతి చెందాడు. మృతుడికి భార్య లక్ష్మి, ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతుడి కుటుంబీకుల ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నాని ఏఎస్ఐ తెలిపారు.

పటాన్‌చెరు టౌన్: చేపలు పట్టేందుకు వెళ్లి వలలో చిక్కుకొని ఓ వ్యక్తి మృతిచెందాడు. ఈ సంఘటన పటాన్‌చెరు పోలీసు స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఆదివారం ఎస్ఐ దుర్గయ్య కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లికి చెందిన శాంతయ్య(52) కుటుంబంతో వచ్చి పటాన్‌చెరు శివారు బంగారుగడ్డ బాలజీ నగర్ సమీపంలో నివాసం ఉంటున్నాడు. కూలి పనులు చేస్తున్నాడు. ఈ క్రమంలో శనివారం మధ్యాహ్నం శాంతయ్య, అతడి స్నేహితుడు ఆంజనేయులుతో కలసి చేపలు పట్టేందులు మూడు వాగుల గుంట వద్దకు వెళ్లాడు. ఆంజనేయులుకు ఈత రాక పోవడంతో ఒడ్డున ఉన్నాడు. శాంతయ్య వల తీసుకొని కుంటులోఈదుకుంటూ వెళ్లాడు. మధ్యలోకి వెళ్లగానే కాలికి వల చిక్కుకోవడంతో నీటిలో మునిగి మృతిచెందాడు. ఆంజనేయులు జరిగిన విషయాన్ని మృతుడి భార్య నాగమ్మకు తెలపగా స్థానికుల సహకారంతో కుంటలో వెతికినా అతడి ఆచూకీ లభించలేదు. ఆదివారం పోలీసులు గజ ఈతగాల సహకారంతో గాలింపు చేపట్టారు. మధ్యాహ్నం మృతదేహాన్ని బయటకు తీయించి పోస్టుమార్టం కోసం పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



అంసాన్‌పల్లిలో వెంకటయ్య మృతదేహాన్ని బయటకు తెస్తున్న దృశ్యం, ఇన్‌సెట్‌లో వెంకటయ్య (ఫైల్)

వేర్వేరు చోట్ల నలుగురి ఆత్మహత్య

వేర్వేరు చోట్ల నలుగురు ఆత్మహత్య చేసుకున్నారు. మద్యానికి అలవాటుపడిన మహిళ పిల్లలను బయటకు పంపి ఇంటిలో ఉరివేసుకుంది. కుటుంబ సమస్యలతో కలత చెందిన విద్యార్థిని గ్రామ శివారు చెరువులో దూకి ప్రాణాలు తీసుకుంది. ఇక అప్పులు ఇచ్చినవారి వేధింపులు తాళ లేక కూలీ బలవన్మరణం చెందాడు. డబ్బు కోసం భార్య బంధువుల ఇంటికి వెళ్లిన సమయంలో ఇంటిలో ఉరివేసుకున్నాడు. వేధింపులకు పాల్పడినవారిపై చర్యలు తీసుకోవాలని మృతుడి భార్య పోలీసులకు ఫిర్యాదు చేసింది. మరోచోట తను ప్రేమించిన యువతి తనకు దక్కకుండా పోతుందనే మనోవేదనతో యువకుడు పురుగుల మందుతాగాడు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. బాధిత కుటుంబాల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసులు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



రేణుక మృతదేహం

పటాన్‌చెరుటౌన్: మద్యం మత్తులో ఓ మహిళ ఆత్మహత్య చేసుకొంది. ఈ సంఘటన పటాన్‌చెరు పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్ఐ రామానాయుడు కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. కర్ణాటక రాష్ట్రానికి చెందిన రేణుక(33) బతుకుదెరువు కోసం కుటుంబంతో కలసి 15 ఏళ్ల క్రితం వచ్చి పటాన్‌చెరు చైతన్యనగర్ కాలనీలో నివాసం ఉంటోంది. కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తోంది. గత కొంత కాలంగా మద్యానికి బానిసైంది. శనివారం రాత్రి మద్యం తాగి ఇంటికి వచ్చింది. ఇంట్లో పిల్లలు ఉండగా వారిని బయటకు పంపి ఉరివేసుకొంది. గమనించిన పిల్లలు స్థానికుల సహకారంతో కిందకు దింపగా అప్పటికే మృతిచెందింది. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ఆస్పత్రికి తరలించారు. మృతురాలి సోదరుడు అశోక్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

కుటుంబ సమస్యలతో మనస్తాపం చెంది..



దివ్యశ్రీ (ఫైల్)

గజ్వేల్‌రూరల్: కుటుంబ సమస్యలతో డిగ్రీ విద్యార్థిని బలవన్మరణానికి పాల్పడిన సంఘటన ఆదివారం గజ్వేల్ పట్టణంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గజ్వేల్ పట్టణానికి చెందిన నాగుల పద్మ, శివ దంపతుల పెద్ద కూతురు దివ్యశ్రీ(20) ఓ ప్రైవేటు కళాశాలలో డిగ్రీ తృతీయ సంవత్సరం చదువుతోంది. కుటుంబ సమస్యల కారణంగా తీవ్ర మనోవేదనకు గురై శనివారం రాత్రి ఇంట్లో నుంచి వెళ్లింది. కుటుంబ సభ్యులు తెలిసిన చోట వెతికినప్పటికీ ఆమె ఆచూకీ లభించలేదు. దీంతో పోలీసులకు సమాచారం అందించారు. పట్టణంలోని ఎర్రకుంట సమీపంలో దివ్యశ్రీ చెప్పులు కనిపించడంతో అక్కడ వెతికినప్పటికీ ఆచూకీ లభించలేదు. మళ్లీ ఆదివారం ఉదయం పోలీసులు గజ ఈతగాళ్లతో ఎర్రకుంటలో గాలింపు చేపట్టి దివ్యశ్రీ మృతదేహాన్ని బయటకు తీయించి, పోస్టుమార్టం నిమిత్తం గజ్వేల్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అప్పులు ఇచ్చినవారి వేధింపులు తాళలేక..



ప్రభాకర్ (ఫైల్)

పాపన్నపేట(మెదక్): అప్పులు ఇచ్చినవారి వేధింపులు తాళలేక ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన మండల పరిధిలోని నాగ్సాన్‌పల్లిలో శనివారం రాత్రి చోటు చేసుకుంది. పాపన్నపేట ఎస్ఐ విజయ్‌కుమార్ కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. నాగ్సాన్‌పల్లికి చెందిన బత్తుల ప్రభాకర్ (45) కూలీ పనులు చేసుకుంటు జీవనం సాగిస్తున్నాడు. కుటుంబ అవసరాల నిమిత్తం మెదక్ పట్టణానికి చెందిన పెద్ద లక్ష్మి వద్ద గతేడాది రూ.10 వేలు అప్పుగా తీసుకున్నాడు. అందుకు అసలు, వడ్డీ కలిపి రూ.85 వేలు చెల్లించాలని ఒత్తిడి చేశారు. అలాగే గజ్వేల్ పట్టణానికి చెందిన పూజ వద్ద రూ.40 వేలు అప్పుగా తీసుకున్నాడు. ఆమె కూడా అప్పు తీర్చలేదన్న కోపంతో ప్రభాకర్‌ను వారం రోజుల క్రితం గజ్వేల్ తీసుకెళ్లి అతనితో చేత నాలుగు రోజులపాటు పనులు చేయించుకుంది. వారంలో అప్పు తీరుస్తానని హామీ ఇవ్వడంతో వదిలేశారు. అప్పులు ఇచ్చిన పెద్దలక్ష్మి, ఆమె బంధువు చిన్న లక్ష్మి, పూజ అప్పు తీర్చాలని వేధించసాగారు. అప్పులు చెల్లించాలని మృతుడి భార్య మాణెమ్మ డబ్బుల కోసం శంకర్‌పల్లిలోని బంధువుల వద్దకు వెళ్లింది. ఈక్రమంలో తీవ్ర మనోవేదనకు గురైన ప్రభాకర్ శనివారం రాత్రి ఇంట్లో ఉరివేసుకున్నాడు. బంధువులు గమనించి పోలీసులకు, భార్యకు సమాచారం ఇచ్చారు. అప్పుల కోసం తన భర్తను వేధించి, అతడి మరణానికి కారణమైన పెద్ద లక్ష్మి, చిన్న లక్ష్మి, పూజపై చర్యలు తీసుకోవాలని మాణెమ్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈమేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు. మృతుడికి కూతురు శ్రీలత, కొడుకు విజయ్ కుమార్ ఉన్నారు.

ప్రేమ విఫలమైందని..

- పురుగుల మందు తాగిన యువకుడు
- చికిత్స పొందుతూ మృతి



బదావత్ సంపత్ (ఫైల్)

అక్కన్నపేట(హుస్నాబాద్): ప్రేమించిన అమ్మాయి తనకు దక్కదేమోనని మనస్తాపానికి గురై ఓ యువకుడు పురుగుల మందు తాగాడు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ సంఘటన అక్కన్నపేట మండలం కపూర్‌నాయక్‌తండా గ్రామ పంచాయతీ పరిధి పూసలతండాలో చోటుచేసుకుంది. గ్రామ సర్పంచ్ భానోతు సంతోష్ నాయక్, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పూసలతండాకు చెందిన బదావత్ కిషన్, గోరి దంపతుల చిన్నకుమారుడు సంపత్(22) ఇంటర్ వరకు హుస్నాబాద్‌లో చదివాడు. కారు డ్రైవర్‌గా హన్మకొండలో పనిచేస్తున్నాడు. అక్కడ ఓ అమ్మాయిని ప్రేమించాడు. ఆ అమ్మాయిని వివాహం చేసుకుంటానని తల్లిదండ్రులకు చెప్పాడు. దీంతో ఇటీవల పెద్ద మనుషులు అమ్మాయి గ్రామమైన దూల్మిట్ట మండలం కొండాపూర్ గ్రామపంచాయతీ పరిధి పంతుల్‌తండాకు వెళ్లి అమ్మాయి కుటుంబసభ్యులతో మాట్లాడగా వారు పెళ్లికి నిరాకరించారు. దీంతో తీవ్ర మనోవేదనకుగురై సంపత్ ఆత్మహత్య చేసుకున్నట్లు కుటుంబ సభ్యులు, బంధువులు చెబుతున్నారు. ఈ విషయంపై ఎస్ఐ తాండ్ర వివేక్‌ను సంప్రదించగా ప్రేమ విఫలమై ఓ యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందింది వాస్తవమేనని, అయితే తమకు ఎవరూ ఫిర్యాదు చేయలేదన్నారు.